క్లుప్తంగా

వైభవంగా మహా పడిపూజ



మాదాపూర్‌లో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

నర్సాపూర్ రూరల్: మండలంలోని మాదాపూర్‌లో శనివారం అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామమంతా మారుమోగింది. మహాపడిపూజలో గురుస్వామి నరసింహ గౌడ్, స్వాములు రాము, నర్సాపూర్ జెడ్పీటీసీ బాబ్యానాయక్, సర్పంచ్ ఉమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడికి చేయూత



ఆర్థిక సహాయం చేస్తున్న స్నేహితులు

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి స్నేహితులు అండగా నిలిచారు. ఆర్థిక సహాయం అందించి తామున్నమంటూ భరోసా కల్పించారు. మండల కేంద్రమైన కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహితుడు శంకర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు అతడిని పరామర్శించి, రూ.76 వేల నగదును చికిత్స కోసం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, ఆంజనేయులు, లక్ష్మణ్, రాయగిరి, రవిగౌడ్, సత్యం, రాజుగౌడ్, భిక్షపతి దూద్యానాయక్, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పూజకు హాజరుకానున్న ఎమ్మెల్యే



జీవన్‌రావు

మెదక్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం మహాపడిపూజ జరగనుంది. ఈ పూజ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దంపతులు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దంపతులు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రావు శనివారం తెలిపారు. పడిపూజకు జిల్లా నలుమూలల నుంచి అయ్యప్ప స్వాములు హాజరవుతున్నారన్నారు. పూజ అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రశ్నించే స్వభావం అలవర్చుకోవాలి

హుస్నాబాద్: అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లోక్‌సత్తా జిల్లా కన్వీనర్ మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి అధ్యక్షతన శనివా రం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి హాజరై మాట్లాడారు. ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నించే స్వభావం అలవర్చుకున్నప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడరని అన్నారు. నిజాయితీ గల ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నప్పుడు మాత్రమే అవినీతిని అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పందిల్ల శంకర్, సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, పద్మ, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బూట్ల రాజమల్లయ్య, మహేందర్, శ్రీనివాస్, వీరసోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేయాలి

హుస్నాబాద్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయాలని భారత చైతన్య యువజన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్లకొండ రవికుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరి కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించడం హర్షణీయమన్నారు. పార్లమెంట్ ఎన్నికలలోపు భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో యువతి, యువకులకు జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్‌రెడ్డి

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో నాయకులు కేక కట్‌చేసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు వృద్ధాశ్రమం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గడీల పాలన నుంచి ప్రజలు విముక్తి పొందారన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలు చేస్తున్నామన్నారు.



తూప్రాన్‌లో కేక్ కట్‌చేస్తున్న నాయకులు



మెదక్ క్యాంపు కార్యాలయంలో ..



రామాయంపేటలో..



నర్సాపూర్‌లో..



రేగోడ్‌లో..



అల్లాదుర్గంలో..



వెల్దుర్తిలో..

తప్పుడు ప్రచారం మానుకోవాలి



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీలో అనుమతి లేని ఇళ్లను అధికారులు కూల్చివేసిన ఘటనలో ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్, భిక్షపతి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను తహసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టారని, అయితే ఎమ్మెల్యే సునీతారెడ్డి కూల్చి వేయించారని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు తమ విధుల్లో భాగంగా అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారన్నారు. కాగా ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో మురళీయాదవ్ ఓడిపోవడంతో పాటు నర్సాపూర్‌లో ఆయనకు తక్కువ ఓట్లు రావడంతో కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. మురళీయాదవ్ టీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లాడని, తన చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండు చేశారు. మురళీయాదవ్ అవినీతికి పాల్పడంతో తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. కాగా పట్టణంలో పలు ప్రభుత్వ భవనాలు కూల్చగా వచ్చిన స్క్రాప్ అమ్మకంలో చైర్మన్ అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

ప్రభుత్వ అధికారులు ప్రొటోకాల్ పాటించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి ఫ్రీ బస్ స్కీం పథకం ప్రారంభ కార్యక్రమానికి ఆర్టీసీ అధికారులు ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఆహ్వానించకపోవడం విచారకరమన్నారు. అధికారులు ఇకపై ప్రొటోకాల్ పాటించాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో అధికారులకు వ్యతిరేకంగా ముందుకు సాగాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నయీమొద్దీన్, అశోక్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, భిక్షపతి, నగేష్, దావూద్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమాత్యుడిపైనే ఆశలు..

- అక్కన్నపేటకు 108 దక్కేనా..?

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలానికి 108 కేటాయించాలని బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంత ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనలు చేశారు. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈసారి హుస్నాబాద్ నియోజకవర్గానికి తొలిసారిగా మంత్రి పదవి వరించడంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై ఈ ప్రాంత ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మండల కేంద్రం, రామవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయితే ఈ రెండింటిలో 108 అందుబాటులో లేదు. అలాగే ఎనిమిది ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 55కి పైగా గిరిజన తండాలు ఉన్నాయి. సుమారు 32 వేల జనాభా ఉంది. ప్రమాదాలు చోటు చేసుకునే సమయంలో సకాలంలో అంబులెన్స్ అందక సామాన్య ప్రజలు, గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే రోజూ ఎక్కడో ఒక చోట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సకాలంలో అంబులెన్స్ సౌకర్యం లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మండలకేంద్రంగా ఏర్పాటై దాదాపు ఎనిమిది ఏళ్లు దాటుతున్నా 108 అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న పొన్నం ప్రభాకర్ అక్కన్నపేట మండలంపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అక్కన్నపేటలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉచిత ప్రయాణం.. మహిళల హర్షం

హుస్నాబాద్/బెజ్జంకి/చేర్యాల: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం శనివారం నుంచి అమలు కావడంతో మహిళలు ఉత్సాహంగా ప్రయాణించారు. హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకం పేద మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి మిగిలిన నాలుగు గ్యారంటీలను అమలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చెర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు వల్లపు రాజు, సరోజన, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి నుంచి కరీంనగర్‌కు మహిళలు ఉత్సాహంగా ప్రయాణించారు. చేర్యాల పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు దాసరి కళావతి, వంగ జయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవి, కౌన్సిలర్ చెవిటి లింగం, పీఏసీఎస్ డైరెక్టర్ ఉడుముల బాల్‌రెడ్డి, లెనిన్‌నగర్ సర్పంచ్ సబిత, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామంలో గ్రామ దేవతల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం దేవతలకు పూజలు పోతరాజు గావు, బొడ్రాయికి పూజలు సర్పంచ్ కీర్తన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 11వ తేదీ వరకు గ్రామంలో జరుగుతాయని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఉప సర్పంచ్ పాండురంగం, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, సునందరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కల్లూరి రాజు, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



గ్రామంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్థిక సహాయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన పాల్కం పార్వతి (50) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ భానుప్రకాశ్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు.

పుస్తకాల పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సాయి ప్రతాప్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ, టీపీసీసీ సెక్రటరీ గంప మహేందర్‌రావు, బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్ పాల్గొన్నారు.

కారు ఢీ: పాదచారి మృతి



కొమురయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం కాస్లాపూర్ జాతీయ రహదారిపై పాదచారిని కారు ఢీకొంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. దౌల్తాబాద్ మండలం సురంపల్లి గ్రామానికి చెందిన కొమురయ్య కాస్లాపూర్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీకి డాక్టరేట్

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మద్దూరు మండలం బెక్కల్ పరిధిలోని శివాలి తండాకు చెందిన లకావత్ బాలాజీ డాక్టరేట్ పొందారు. బాలాజీ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాకతీయ యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రం ప్రొఫెసర్ గుగులోత్ వీరన్న ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల పనితీరు– జనగామ జిల్లా యొక్క పరిశీలన' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. శనివారం కేయూ నుంచి డాక్టరేట్ స్వీకరించాడు.

బస్‌డిపో ఏర్పాటు చేయాలి

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో బస్ డిపో, ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రామచందర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో రామాయంపేటకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుపై చర్యలు తీసుకున్నారన్నారు. రామాయంపేట బస్టాండ్‌కు గతంలో పలు డిపోలకు చెందిన 500 బస్సులు వచ్చేవని, ఇప్పుడు 50 బస్సులు కూడా పట్టణానికి రావడంలేదన్నారు. బస్సు వసతి లేక పట్టణ ప్రజలు నానా అవస్థలుపడుతున్నారన్నారు. చాలా బస్సులు పట్టణంలోకి రాకుండా నేరుగా జాతీయ రహదారిపై నుంచే వెళ్లిపోతున్నాయన్నారు. రామాయంపేటలో బస్‌డిపో ఏర్పాటుకు గతంలో స్థలం కేటాయించడం జరిగిందన్నారు. ఆయన వెంట లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు, ఇతర నాయకులు ఉన్నారు.



రామాయంపేటలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం



రేగోడ్‌లో ఉచిత బస్సు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో శనివారం ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని మహిళా ప్రయాణికులతో కలిసి కోఆప్షన్ సభ్యుడు చోటుమియా, పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సునీత, ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ దశరథం, వార్డు సభ్యుడు హరీశ్, మాజీ వార్డు సభ్యుడు తూర్పు నాగప్ప, నాయకులు రమేశ్‌గుప్తా, శివకుమార్, మోహన్, వెన్నీల రాజు, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణ పథకం హర్షణీయం

టేక్మాల్(మెదక్): శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించడం శుభసూచకమని టేక్మాల్ జెడ్పీటీసీ సర్వని సరోజ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ గ్యారంటీ అమలు చేస్తుందన్నారు.

మహిళలకు మేలు జరుగుతుంది

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారికి మేలు జరుగుతుందని చిన్నశంకరంపేట ఎంపీపీ భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం చిన్నశంకరంపేటలో ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేసిన అనంతరం మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి తొలి సంతకం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరుణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ ఆవుల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో బస్సులో ప్రయాణిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ అరుణ

రోడ్డు వేశారు.. గ్రావెల్ మరిచారు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో సీసీ రోడ్డు వేసి, గ్రావెల్ పోయకపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూర్బన్ నిధుల కింద బస్టాండ్ సమీప సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుంచి గ్రామంలోని మద్యం దుకాణం వరకు రూ.56 లక్షలతో సీసీ రోడ్డు వేశారు. అక్కడి నుంచి స్పెషల్ ఫండ్ కింద రూ.1.20 కోట్లతో దుర్గమ్మ గొని వరకు ఈ రోడ్డు పొడిగించారు. అయితే రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం, మధ్యలో డివైడర్ వేయడంతో ఇరుకుగా మారింది. ఫోర్ వీలర్ వాహనం వస్తే ద్విచక్రవాహనం వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ పోయలేదు. దీంతో రెండు వాహనాలు ఒకేసారి వచ్చినపుడు టేపర్ ఎక్కువగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా బుధవారం సంత కావడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గ్రావెల్ పోయకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్న టేపర్

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు

నంగునూరు(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/దుబ్బాక/కొండపాక/హుస్నాబాద్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటరూరల్/తొగుట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కోనాయిపల్లి వెంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, మల్లయ్య, సారయ్య, మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ ఎల్లమ్మ దేవాలయంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్, ఎంపీటీసీలు కిరణ్, కవిత, కో ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, సర్పంచ్ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి దుబ్బాక బాలాజీ దేవాలయంలో పూజలు నిర్వహించారు. కొండపాక మండలం దుద్దెడ స్వయంభు శంభు దేవాలయంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నూనె కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే కుకునూర్‌పల్లి హనుమాన్ దేవాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు పూజలు చేశారు. హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆధ్వర్యంలో శివాజీనగర్ దాస ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని మోహినిపూర వెంకటేశ్వర ఆ లయంలో నాయకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో రంగధాంపల్లి శ్రీను, జువ్వన కనకరాజు, మహేష్, రజనీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాల్లో నిలిచినప్పుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మంజీరా, ప్రగతి విద్యా సంస్థల కరస్పాండెంట్ మంద అంబదాస్ పేర్కొ న్నారు. శనివారం పట్టణంలో ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డేను ని ర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయోజకులను చేయాలని చదివిస్తుంటారని, వారి ఆశలను అడియాసలు చేయకుండా లక్ష్యం దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెట్టయ్య చౌదరి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన